భీమవరం **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 34.0

కనిష్ఠం : 25.0

అమ్మకు కడుపు కోత!



జిల్లాలో పెరుగుతున్న సిజేరియన్ ప్రసవాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆపరేషన్లు చేయడంలో పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలోనే మూడోస్థానంలో నిలవడంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టింది. కాసుల కక్కుర్తితో కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు కత్తెర్లకు పనిచెబుతూ అమ్మ జీవితాన్ని నరకంలోకి నెట్టేస్తున్నారు. ఇప్పటికే సిజేరియన్ ఆపరేషన్‌లపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. వైద్యులు జాతీయ వైద్య మండలి నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

- నూటికి 70 మందికి సిజేరియన్లు వైద్యుల కాసుల కక్కుర్తే కారణమా ?
- ఆపరేషన్లలో పశ్చిమ మూడో స్థానం.. ఆరోగ్య శాఖ మంత్రి ఆగ్రహం
- అత్యధికంగా చేసిన 42 ఆసుపత్రులకు వివరణ కోరుతూ షోకాజ్
- ఆసుపత్రుల తనిఖీలకు కమిటీ ఏర్పాటు.. 60 శాతానికి తగ్గింపునకు కృషి

భీమవరం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కొన్ని అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే గర్భవతికి సిజేరియన్ ఆపరేషన్ చేయాలి. కాని, కాసుల కక్కుర్తితో కొందరు వైద్యులు అవసరం లేకపోయినా సిజేరియన్‌లు చేయిస్తున్నారు. ఇందుకు ఆయా ఆసుపత్రుల గణాంకాలే చెబుతున్నాయి. ఈ విషయంలో మన జిల్లా గత ఏడాది రెండో స్థానంలో ఉండగా, ఈ ఏడాది కాస్త తగ్గి మూడో స్థానానికి చేరింది. పైనుంచి వచ్చిన ఒత్తిడితోనే వైద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఇది తగ్గింది. అయినప్పటికీ ఇది ఇంకా తగ్గాల్సి వుంది. సాధారణంగా జిల్లాలో ఏడాదికి 18 వేల నుంచి 20 వేల వరకు ప్రసవాలు జరుగున్నాయి. వీటిలో 12 నుంచి 13 వేల వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లోను, ఆరు నుంచి ఏడు వేల వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోను జరుగుతున్నాయి. వీటిలో 70 శాతం వరకు సిజేరియన్లే కావడం ఆందోళన కలిగించే విషయం. కొన్ని పీహెచ్‌సీల్లో 97 శాతం నమోదు కావటం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఏడాది గట్టిగా ప్రయత్నించడంతో 70 నుంచి రెండు శాతానికి తగ్గి 68 శాతానికి తగ్గింది. దీనిని 60 శాతానికి తగ్గించేలా ప్రయత్నం చేస్తున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోను (మిగతా 8వ పేజీలో..)



అకారణంగా సిజేరియన్లు

- నెలలు నిండిన తర్వాత బిడ్డకు జన్మనివ్వడం పాత పద్ధతి. ఇప్పుడు ముహూర్తాలు పెట్టించుకుని మరీ ప్రసవం చేయించే వారు పెరిగిపోవడంతో ఆపరేషన్లు తప్పడం లేదు.
- పురిటినొప్పులు తట్టుకోలేమనే భావనతో చాలా మంది ఆపరేషన్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు.
- నార్మల్ డెలివరీకంటే సిజేరియన్ చేస్తే అధికంగా డబ్బులు వసూలు చేయవచ్చని కొందరు కక్కుర్తిపడి వీటికే ప్రాధాన్యత ఇస్తున్నారు.

జీవన శైలిలో మార్పులే కారణం



మహిళల జీవన శైలిలో మార్పులు వచ్చాయి. వారిలో వ్యాయామం తగ్గడం, సరైన వయసుల్లో వివాహాలు కాకపోవడం, ఆలస్య గర్భధారణ, ఆహార నియమాలు సరిగా పాటించకపోవడం తదితర కారణాలతో ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాధారణ ప్రసవాలకు బదులు సిజేరియన్‌లు చేయాల్సి వస్తోంది. మరోవైపు రిస్క్‌కు అవకాశం ఇవ్వకుండా ఎక్కువ మంది ఎలాంటి సమస్యలు లేకుండా ప్రసవం జరగాలనే ఆకాంక్ష పెరగడమూ మరో కారణం.

- డాక్టర్ యిర్రింకి లక్ష్మి, గైనకాలజిస్టు, భీమవరం



వీరవాసరంలో మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

టెన్త్ మూల్యాంకనం పకడ్బందీగా పూర్తి చేయాలి

- కలెక్టర్ చదలవాడ నాగరాణి

వీరవాసరం/భీమవరంటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. వీరవాసరం ఎం.ఆర్.కె జిల్లా పరిషత్ హైస్కూల్లో టెన్త్ మూల్యాంకనం ప్రక్రియను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పలు జిల్లాలకు చెందిన తొమ్మిది సబ్జెక్టులకు సంబంధించి 1,69,341 జవాబు పత్రాలు మన జిల్లాకు వచ్చాయన్నారు. 102 మంది చీఫ్ ఎగ్జామినర్స్ 612 మంది సహాయ ఎగ్జామినర్స్, 204 మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తం 918 మంది డీఈవో ఈ.నారాయణ పర్యవేక్షణలో మూల్యాంకనం పూర్తిచేసేందుకు నియమించారన్నారు. జేసీ టి.రాహుల్‌కు మార్‌రెడ్డి ఉన్నారు.

'నీట్'కు ఏర్పాట్లు చేయాలి

జిల్లాలో మే4న నిర్వహించే నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, పరీక్షల నిర్వహణ డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి, ఎన్ఐటీ అధికారులతో సమీక్షించారు. తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ, శశి కాలేజీలలో రెండు సెంటర్లను పరీక్షలకు కేటాయించారన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్

తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం టౌన్: జిల్లాలో జేఈఈ మెయిన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా సాగాయి. తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షలకు 180 మందికి గాను 176 మంది, సాయంత్రం పరీక్షలో 180 మందికి గాను 174 మంది హాజరయ్యారు. తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షలో 72 మందికి గాను 65 మంది, సాయంత్రం పరీక్షలకు 72 మందికి గాను 70 మంది పరీక్షలకు హాజరయ్యారు. భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో ఉదయం 100 మందికి 98 మంది, సాయంత్రం వంద మందికి 89 మంది హాజరయ్యారు.



నవాబుపాలెంలో ఉపాధి పనులు (ఫైల్)

ఉపాధి ఫుల్!

జిల్లాలో 40 లక్షల పని దినాలు లక్ష్యం

గత ఏడాది రికార్డు దిశగా 37.71 లక్షల పనుల కల్పన

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో మెండుగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఈ ఏడాది 2025-26 ఆర్థిక సంవత్సరం 40 లక్షల పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో అధికారులు యోచిస్తున్నారు. వాటితో పాటు 140 నీటి తొట్టెలు నిర్మించి మూగజీవాల దప్పిక తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. అవే కాకుండా పూడికతీత పనులు, పండ్ల తోటల పెంపకం పనులు, పశుగ్రాసం పెంపకం, తాగునీటి చెరువుల పునరుద్ధరణ, మౌలిక వసతుల కల్పనకు అవకాశం కల్పించేలా ముందుకు వెళ్తున్నారు. ప్రతీ కూలీకి రూ.307 తగ్గకుండా వేతనం అందించేందుకు రూ.50 లక్షల వ్యయంతో అంచనాలు తయారు చేశారు.

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) :

గతేడాది లక్ష్యాలకు చేరువగా..

గత ఏడాది ఉపాధి హామీ పథకంలో ముందుగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకుని 96.69 శాతం విజయం సాధించారు. గతంలో 39 లక్షల పనిదినాల కల్పన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించగా 37.71 లక్షల పనిదినాలు కల్పించి రికార్డు సృష్టించారు.

చెరువుల పునరుద్దరణ..

గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చెరువుల్ని నీరుకార్చేసింది. జిల్లా వ్యాప్తంగా చెరువుల్లో తట్ట మట్టి కూడా తీయించలేదు. చెరువుల్లో మట్టి పేరుకుపోయి గట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి ఎండిపోతున్నాయి. చెరువుల పునరుద్ధరణ, జలసంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. తొలిదశలో గ్రామానికో చెరువును ఎంపిక చేసి పూడిక తీయించి చెరువు గట్లను బలోపేతం చేయనుంది.

సగటు వేతనానికి భరోసా..

చాలామంది ఉపాధి కూలీలకు కూలి గిట్టుబాటు కావడంలేదు. ఈ మేరకు నిరాశతో ఉన్న కొంతమంది కూలీలు పనులకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో వేసవిలో రోజూ కనీసం సగటు వేతనం రూ.300 దక్కేలా అధికారులు పనులు చూపించాల్సి ఉంటుంది. ఇందుకోసం నాలుగు గంటలు పనిచేస్తే కూలి గిట్టుబాటు అయ్యేలా బృందానికి కొలతలతో మార్కింగ్ ఇస్తారు.

పశువులకు నీటి తొట్టెలు

ప్రతీ గ్రామంలో పశువులకు నీటి తొట్టెలను పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడెక్కడ నీటి తొట్టెలు నిర్మించాలో అధికారులు నిర్ణయించాక పనులు ప్రారంభిస్తారు. పశువులు, మేకలు గొర్రెలు తిరిగే మార్గంలో బోరు, పంచాయతీ కుళాయి ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చి నిర్మాణ పనులు చేపడతారు. ఈనెలాఖరుకు నీటి తొట్టెల నిర్మాణం పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలందాయి.



తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు సమర్పించిన స్వీట్లు, పిండి వంటలతో అమ్మవారి ప్రతిరూపంలో అలంకరించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తాడేపల్లిగూడెం రూరల్



చాట్రాయిలో మొక్కజొన్న పంటపై బరకాలు కప్పిన రైతులు

వాతావరణం

- చిరుజల్లులతో రైతుల గుండెల్లో గుబులు

కలిదిండి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి మబ్బుల వాతావరణం కొనసాగుతూ చిరుజల్లులు పడుతుండడంతో రైతులు పరుగులు పెడుతున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలంలో రబీ సీజన్‌లో 8,200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం అధికశాతం పంట కల్లాలపై ఉంది. ఇప్పుడు వర్షం పడితే పంట తడిసిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముసునూరు మండలంలో గురువారం అర్ధరాత్రి మోస్తరు వర్షం కురియడంతో పొగాకు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 800 ఎకరాల్లో పొగాకు సాగు చేయగా 50శాతం పందిళ్ల కోసి మండెలు వేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వాతావరణం మార్పులతో కలిదిండి మండలంలో చేపలు, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ హెచ్చుతగ్గులు ఏర్పడి చనిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వనామీపై ట్రంప్ సుంకాల ప్రభావం

- రూ.30 ధర పతనం
- ఆందోళనలో ఆక్వా రైతులు

6



ఏలూరులో తొలి రిజిస్ట్రేషన్ చేసిన ఏలూరుకు చెందిన కె.రాశికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు

స్లాట్ బుకింగ్ సక్సెస్

- భీమవరం, ఏలూరుల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభం
- సమయం కలిసొచ్చిందంటూ కక్షిదారుల ఆనందం

భీమవరం టౌన్/ (ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రిజిస్ట్రేషన్లలో ముందస్తు స్లాట్ బుకింగ్ విధానాన్ని ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని భీమవరం, ఏలూరుల్లో ప్రయోగాత్మకంగా శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాకేంద్రాల్లోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునేవారు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి వేచి ఉంటూ తమ వంతు వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వచ్చేది. చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ విధానం వల్ల ముందుగా స్లాట్ బుక్ చేసుకుని 15 రోజుల వ్యవధిలో వీలు కుదిరిన సమయంలో రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటును తెలుగుదేశం ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది.

- ఏలూరు జిల్లాలో తొలి రోజైన శుక్రవారం ఏలూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో 15 మందికిపైగా స్లాట్ బుకింగ్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లకు దిగారు. తొలిగా ఏలూరుకు చెందిన కూరపాటి రాశి రిజిస్ట్రేషన్ చేయగా సంబంధిత పత్రాలను జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు అందించారు. 'నిజంగా.. రిజిస్ట్రేషన్ శాఖలో వచ్చిన కొత్త పద్ధతి చాలా బాగుంది. ముందస్తు సమాచారాన్ని అందుకుని కార్యాలయానికి వచ్చాం. అనుకున్నది అనుకున్నట్టుగా క్షణాల్లో పని పూర్తయ్యింది. చాలా సంతోషంగా ఉంది' అని రాశి ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా రిజిస్ట్రార్ సత్యనారాయణ సైతం ప్రజలు స్లాట్ బుకింగ్ పద్ధతిపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా రిజిస్ట్రేషన్లకు సులువు అవుతుందని పేర్కొన్నారు. తొలి రోజే 15కుపైగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ఇంతకుముందు రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు, వారి సహాయకులతో కార్యాలయం కిక్కిరిసి ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితికి చెక్ పెట్టి స్లాట్ బుకింగ్ తొలిరోజే రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్షణాల వ్యవధిలో పూర్తి చేశారు.

ఉండి, పాలకొల్లు ఏఎంసీ చైర్మన్‌లుగా నాగరాజు, విజయభాస్కర్



జె.నాగరాజు కె.విజయభాస్కర్

ఉండి/పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జుత్తుగ నాగరాజు ఎంపికయ్యారు. శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఉండి మండలం మహదేవపట్నానికి చెందిన నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా నాగరాజు పనిచేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు సహకారంతోనే చైర్మన్‌గా ఎన్నికైనట్టు తెలిపారు. గతంలో పంచాయతీ ఉప సర్పంచ్‌గా, ఏఎంసీ వైస్‌చైర్మన్‌గా ప్రజలకు సేవలందించారు. ఆయన ఎంపిక పట్ల జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

- పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పాలకొల్లు రూరల్ మండలం సగంచెర్వుకు చెందిన టీడీపీ పాలకొల్లు మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్‌ను నియమిస్తూ ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన స్వస్థలం మొగల్తూరు మండలం శేరేపాలెం. దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టిన సమయంలో నరసాపురం వచ్చిన సదర్భంగా అప్పటికి తొమ్మిదో తరగతి చదువుతూ సైకిల్‌పై మీటింగ్‌కు వెళ్లి టీడీపీపై అభిమానం చాటుకున్నారు. 2002లో పాలకొల్లు మండలం సగంచెర్వు గ్రామానికి వలస వచ్చి స్థిరపడ్డారు. పార్టీలో గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు పదవులు చేపట్టి ప్రస్తుతం టీడీపీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన భార్య కోడి విజయలక్ష్మి సగంచెర్వు సర్పంచ్‌గా, పాలకొల్లు మండల జడ్పీటీసీగా పనిచేశారు. తనను ఈపదవికి ఎంపిక చేసిన సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

వక్ఫ్ చట్ట సవరణ దుర్మార్గమని, రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం కమిటీ నాయకులు, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో భీమవరంలో పెద్ద మసీదు నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.

వివరాలు 8

మృత్యువును గెలవలేక..



13 రోజులుగా చికిత్స పొందుతున్న ఫార్మాసిస్ట్ నాగాంజలి మృతి

7



వనామీ రొయ్యలను పట్టుబడి చేస్తున్న రైతులు

వనామీపై ట్రంప్ సుంకాల ప్రభావం

రూ.30 ధర పతనం

ఐదు రోజులు పట్టుబడులు వద్దంటున్న కంపెనీలు

ఆందోళనలో ఆక్వా రైతులు

కైకలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాలు పెంచడంతో దాని ప్రభావం ఇక్కడ ఆక్వా రంగంపైనా తీవ్రంగా పడింది. అమెరికా దిగుమతి చేసుకునే అన్ని రకాల ఉత్పత్తులపై 27 శాతం పన్నులు పెంచడంతో ఆక్వా రంగం దెబ్బతింది. దీంతో రైతులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా ప్రాస్‌ఫార్మర్స్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు మరో ఐదు రోజుల పాటు రైతులు ఎక్కడా రొయ్యల పట్టుబడులు చేయవద్దని వైరస్ సోకితేనే పట్టుబడి చేసేందుకు ముందుకు వెళ్లాలని సూచించారు. 100 కౌంటు ధర రెండు రోజులు క్రితం రూ.250 ఉంటే శుక్రవారం మార్కెట్ ధర రూ.220కు కొనుగోలు చేస్తున్నారు. రూ.30 వరకు పతనమైంది. ప్రపంచంలో అన్ని దేశాలకంటే భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే మెరైన్ ఉత్పత్తులే తక్కువ ధరకు అమెరికాకు రవాణా అవుతున్నాయి. భారత్‌పై కూడా భారీగా ట్యాక్సు పెంచడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 2.50 లక్షల ఎకరాల్లో రైతులు రొయ్యలను సాగు చేస్తున్నారు.

అమెరికాకు ప్రతీ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ నుంచి 17.2 లక్షల టన్నులు వనామీ రొయ్యలు ఎగుమతి అవుతుంటాయి. ఇప్పటికే పట్టుబడులు నిలిపివేయడంతో ఆక్వా కూలీలకు ఉపాధి కరువయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పట్టుబడులు నిలిపివేయడం వలన రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి ఆక్వా ఉత్పత్తులపై ఇరు దేశాలు చర్చలు జరిపి సుంకాలు తగ్గించేలాగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నృత్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

జాతీయ నాటక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా స్వేచ్ఛ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో ఉగాది వేడుకల్లో భాగంగా నిర్వహించిన జాతీయ నాటక పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా హైద్రాబాద్‌లోని విజయశాంతి కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన స్వేచ్ఛ నిలిచింది. ఉత్తమ నటుడిగా స్వేచ్ఛ నాటికలో నటించిన గోవాడ వెంకట్, ఉత్తమ దర్శకుడిగా దర్శకుడు బీఎం రెడ్డి, ఉత్తమ రచన కర్తగా శివరాంలు అవార్డులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విజేతలకు ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుబ్బళ్ల గోపాలకృష్ణ, తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెలువాది వేణుగోపాల్‌లు బహుమతులు అందించారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ నాటకాలకు జీవం పోసి ఉత్సవాలు నిర్వహించి వాటిని ఆదరించడం అభినందనీయమని, ప్రభుత్వాలు కూడా నాటకాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.నృత్యపోటీల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందించారు.బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు, సినీ ఎగ్జిబిషన్ అసోసియేషన్ అధ్యక్షుడు యెలిశెట్టి మోహన్, నాటక పరిషత్ అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు, రేపు భీమవరంలో రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలు



వివరాలు తెలుపుతున్న నిర్వాహకులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5,6 తేదీల్లో ఆనంద గీతా యజ్ఞం రాష్ట్ర స్థాయి భగవద్గీత పఠన పోటీలను ఉద్దరాజు ఆనంద రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని ఆనంద ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు తెలిపారు. శుక్రవారం పోటీల వివరాలను వెల్లడించారు. ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల పోటీలను 4 విభాగాల్లో నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు సుమారు వెయ్యిమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఉదయం గం 9 నుంచి సాయంత్రం 5 వరకు, పోటీ ల్లోని విజేతలకు 13న ఆనందరాజు వర్ధంతి సభలో ప్రముఖుల సమక్షంలో బహుమతులు అందిస్తామని తెలిపారు. ప్రతి విభాగంలోని ప్రథమ రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ రూ.2 వేలు, కన్సోలేషన్ రూ.వెయ్యి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందిస్తామని, 108 శ్లోకాల పోటీల్లో విజేతలకు ప్రథమ రూ.6 వేలు, ద్వితీయ రూ.4 వేలు, తృతీయ రూ.2 వేలు, జ్ఞాపిక, పాల్గొన్న వారందరికి ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు. నిర్వాహకులు దాయన చంద్రాజీ, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

భీమవరంలో 24 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) భీమవరం డీఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీల్లో చైతన్య భారతి 18వ జాతీయస్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు చైతన్యభారతి నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ తెలిపారు. శుక్రవారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను నాటక పరిషత్ సభ్యులు కలిసి నాటక మహోత్సవానికి రావాలని కోరారు. 17 ఏళ్లుగా నాటక పోటీలు నిర్వహిస్తూ పురస్కారాలను అందిస్తున్నట్లు మంత్రికి వివరించారు. నాటక పరిషత్ కార్యదర్శి మంతెన రామ్‌కుమార్ రాజు, డాక్టర్ కత్రేడ్డి సత్యనారాయణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పేరిచర్ల లక్ష్మణవర్మ పాల్గొన్నారు.



నరేష్ బాబుకు నంది పురస్కారం

పాలకొల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు చవాకుల ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబుకు నంది పురస్కారం లభించింది. రాజమండ్రిలో శుక్రవారం రోటరీ హాల్లో పాన్ ఇండియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాతృభాషా, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో నరేష్ బాబు చేసిన సామాజిక సేవలను గుర్తించి నంది పురస్కారానికి ఎంపిక చేసినట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా తెలిపారు. పిఠాపురం సంస్థానం రాజ వంశీయులు రాజారావు వేంకట మహీపతి రామ రత్నరావు బహద్దూర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్టు నరేష్‌బాబు తెలిపారు. గజల్ శ్రీనివాస్, కళారత్న కత్తిమండ ప్రతాప్, నర్సిపల్లి హారిక, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు గుబ్బల రాంబాబు, చెరుకువాడ రంగసాయి, అట్టాడ అవినాష్ పాల్గొన్నారు





హాయిగా.. కూల్‌గా..

మండుటెండలో అయినా ఆ రహదారిలో ప్రయాణం హాయిగా సాగిపోతుంది. ఆ దారిలో వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు కొంత సేపు చెట్లనీడన ఆగి సేద తీరుతుంటారు. ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల నుంచి వట్లూరు మినీ బైపాస్ సెంటర్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు ఉష్ణతాపంతో అల్లాడుతున్న ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. చల్లని గాలిలో ఏమి హాయిలే ఇలా..అనుకుంటూ ఈ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులతో పాటు స్థానికులు సైతం మధ్యాహ్న సమయంలో ఇక్కడకు చేరుకుని కొంతసేపు విశ్రమించిన అనంతరం గమ్యస్థానాలకు బయలు దేరుతున్నారు.

- ఏలూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

రబీ సేఫ్



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి జలాలు

నిలకడగా గోదావరిలో నీటి నిల్వలు

ఉమ్మడి జిల్లాల పంటలకు సరిపడా సాగునీరు

జలవనరుల శాఖ ముందస్తు చర్యలు

పోలవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా ఏప్రిల్, మే నెలల్లో గోదావరిలో నీటి నిల్వలు తగ్గి పోవడం వల్ల రబీ సాగుకు సాగునీరు తగినంతగా ఉండక రైతులు పంట విరామం పాటించవలసిన పరిస్థితులు ఉండేవి. ఈ ఏడాది ఆ పరిస్థితు లకు భిన్నంగా రబీలో వరి, మొక్కజొన్న, అపరాలు, కూరగాయల సాగుకి కూడా సాగునీరు అందే విధంగా జలవనరులశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలలో సుమారు 8 లక్షల ఎకరాలకు సాగు నీరందింది. గత ఏడాదితో పోలిస్తే గోదావరిలో ఈ ఏడాది ఏప్రిల్ నాటికి నీటి నిల్వలు ఆశాజనకంగానే ఉన్నాయి. దీనికి కారణం జలవనరుల శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సీలేరు నుంచి నిత్యం 9,500 క్యూసెక్కుల జలాలను గోదావరిలోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవడమే.

గోదావరిలో 10,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పోలవరం ప్రాజెక్టు వద్ద గతేడాది నీటిమట్టం స్పిల్వే ఎగువన 21.500 మీటర్లు ఉండగా ఈ ఏడాది 22.180 మీటర్లు నమోదైంది. స్పిల్వే దిగువన గతేడాది 14 మీటర్లు ఉండగా ఈ ఏడాది 15.330 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాం వద్ద గతేడాది 21.550 మీటర్లు ఉండగా ఈ ఏడాది 22.230 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన గతేడాది 13.450 మీటర్లు ఉండగా ఈ ఏడాది 13.440 మీటర్లు నమోదైనట్టు పోలవరం ప్రాజెక్టు డీఈ మాధవరావు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన నీటిమట్టం గేట్ల క్రస్ట్ లెవెల్‌కి దిగువకు ఉండడం వల్ల స్పిల్వేలో ఉన్న 10 స్లూయిజ్‌ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తూ నీటి పంపిణీని క్రమబద్ధీకరిస్తున్నారు. పోలవరంలో గతేడాది గోదావరి నీటిమట్టం 13.597 మీటర్లు నమోదైందని సీడబ్ల్యూసీ సిబ్బంది నవీన్ నాయుడు తెలిపారు. పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం వద్ద నీటి మట్టం 13.357 మీటర్లు నమోదైనట్టు డీఈ భాస్కర రామకృష్ణ తెలిపారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 13.53 మీటర్లు నమోదైందని రబీ సీజనుకు ఉభయ గోదావరి, మధ్య గోదావరి డెల్టాలకు 10,300 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్లు, గోదావరిలో 10,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు గోదావరి హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు.

పట్టిసీమ వద్ద లో లెవెల్..

గోదావరిలో నీటిమట్టం ప్రస్తుతం నిలకడగా ఉండడం వల్ల పోలవరం కడమ్మ ఎత్తిపోతల పథకం, గూటాల పంపింగ్ స్కీం, వేగేశ్వరపురం పంపింగ్ స్కీం, ఆరికిరేవుల పంపింగ్ స్కీంల ద్వారా ఉమ్మడి పశ్చిమ డెల్టాలో రబీకి తగినంత సాగు నీరందుతుంది. పట్టిసీమ వద్ద గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు దిగువకు ఉండడం వల్ల పట్టిసీమ నీటి విడుదల సాధ్యం కాలేదు. దీని ప్రభావం వల్ల పోలవరం ప్రాజక్టు కుడి ఎడమ కాలువల పరిధిలో రబీ సాగుకి సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగు నీరు లేకుండా పోయింది. పోలవరం ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలకు డివిజన్ల వారీగా లాకులు నిర్మించి వరదల సీజను చివరి రోజుల్లో ఎక్కడికక్కడ లాకులు మూసి నీటి నిల్వలు ఉంచడం, కుడి ఎడమ కాలువల పరిధిలో పంటపొలాల మధ్య చెరువులు, రిజర్వాయర్ ట్యాంకులు నిర్మించి నీటిని నింపి నిల్వలు ఉంచడం ద్వారా సాగునీటి కష్టాలను అధిగమించవచ్చని పలువురు రైతులు సూచిస్తున్నారు.

సిద్ధాంతం, నడిపూడి, కోడేరుల్లో ఇసుక మేటలు..

ఆచంట/పెనుగొండ (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం, ఆచంట పరిధిలో గోదావరి ప్రవాహం తగ్గి నీటిమట్టం తగ్గడంతో గోదావరిలో అక్కడక్కడా ఇసుక తెన్నెలు దర్శనమిస్తున్నాయి. సాధారణ రోజుల్లో గోదావరి ఎంతలోతు ఉంటుందో ఎవరికీ తెలియదు. గోదావరి నీటి మట్టం బాగా తగ్గి ఉండటంతో బ్యాంక్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీరు అందక సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వేసవిలో సిద్ధాంతం, నడిపూడి, కోడేరు వద్ద నీటిమట్టం బాగా తగ్గింది. ఇసుక మేటలను తొలగిస్తే గోదావరిలో ఎపుడూ నీటి ప్రవాహం ఉంటుందని సాగునీటికి, తాగునీటికి కూడా ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతున్నారు.



ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి జలాలు

ఉపనదుల నీరే ఆధారం



రుద్రమ్మకోట వద్ద సాధారణ స్థితిలో గోదావరి

వేలేరుపాడు (ఆంధ్రజ్యోతి): జూలై నెల నుంచి సెప్టెంబరు నెలాఖరువరకు ఉధృతంగా ప్రవహించే గోదావరి నది అక్టోబరు నెల నుంచి ప్రవాహాలు తగ్గి సాధారణ స్థితికి చేరుకుని ఏప్రిల్, మే నెలల్లో నీటి మట్టాలు పూర్తిగా పడిపోతాయి. గత సెప్టెంబరు నుంచి వర్షాలు లేకపోవడంతో గోదావరి నదికి నీటి ప్రవాహాలు భారీగా పడిపోయాయి. ప్రస్తుతం గోదావరి మొత్తం చిన్న పిల్ల కాల్వలా ప్రవహిస్తూ ఇసుక దిబ్బలు దర్శన మిస్తున్నాయి. గోదావరి ఎగువ భాగాన నిర్మించిన ప్రాజెక్టులు నీటి విడుదలను పూర్తిగా నిలిపి వేయడంతో గోదావరికి నీటి ప్రవాహాలు ఘననీయంగా పడిపో యాయి. అయితే గోదావరికి ఉప నదులైన తాలిపేరు, కిన్నెరసాని, శబరి నదుల నుంచి కొద్దిపాటి నీటి ప్రవాహాలు వచ్చి గోదావరిలో కలుస్తున్నాయి. దీని కారణంగా ప్రస్తుతం కూనవరం వద్ద 10 వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోంది. ఈ ఉపనదుల నుంచి వచ్చే నీటి కారణంగానే పోలవరం అక్కడ నుంచి ధవళేశ్వరానికి నీటిని విడుదల చేసి కాల్వలకు నీరు వదిలే అవకాశం ఇప్పటి వరకు ఉంది.

డీఎస్సీ పరీక్షార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ- 2025 ఉపాధ్యాయ నియామకాల పరీక్షకు సిద్ధమవుతున్న బీసీ, ఈడబ్ల్యుఎస్ (ఈబీసీ) అభ్యర్థులు ఇంటి నుంచే ఉచిత ఆన్‌లైన్ శిక్షణ పొందేందుకు జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్.వి నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, టీటీసీ/బీఎడ్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా ఫోటోస్టాట్ కాపీలతో దరఖాస్తులను ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని బీసీ సంక్షేమాధికారి కార్యాలయంలో స్వయంగా అందజేయాలని సూచించారు. వివరాలకు కార్యాలయ ఫోన్ నంబరు 86861 80018లో సంప్రదించాలని కోరారు.



భీమవరం మార్వాడీ సందులో భిక్షాటన చేస్తున్న చిన్నారులు

అయినా ఆగలేదు.. భిక్షాటన చేయిస్తున్న దళారులు

భీమవరం క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, అధికారులు భిక్షాటన దందాలపై గట్టి నిఘా పెట్టి ఎన్ని హెచ్చరికలు చేసినా కొందరిలో మార్పు రావడం లేదు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు దళారులు చిన్నారులతో భిక్షాటన చేయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో పెద్ద పెద్ద సిటీల్లోను, పట్టణాల్లోను ఇటువంటి దందాలు కొనసాగేవి. పేదలను ఎంచుకుని వారికి రోజుకు ఇంత నగదు ఇస్తామని చెప్పి వారితో భిక్షాటన చేయించడం ఇప్పుడు వ్యాపారంగా మారింది.. ఇటువంటివి జిల్లాలో కొన్ని ముఠాలు ఉన్నట్లు సమాచారం. వారు కావాలనే చిన్నారులను ఎంచుకుని వారికి రద్దీగా ఉండే కూడళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద భిక్షాటన చేయిస్తుంటారు. పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులను కూడా ఈ వృత్తిలోకి దింపుతారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 3న కథనం రావడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. వెంటనే యాచక వృత్తి చేస్తున్న చిన్నారులను హోమ్‌కు తరలించాలని ఆదేశించడంతో గురువారం పోలీసులు, రెవెన్యూ అధికారులు కొంతమంది చిన్నారులను చిల్డ్రన్ హోమ్‌కు తరలించారు.



లక్ష గాజుల అలంకరణలో కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఐదు లక్షల గాజుల అలంకరణలో భక్తులకు దర్శన మిస్తున్న అమ్మవారికి శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సోమవారం వరకూ జరగనున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గాజుల అలంకరణలో నిండు ముత్తైదువులా భక్తులకు దర్శన మిస్తున్నారు.ఈనెల 7న గురువారం ఆలయ ఆవరణలో మహిళలతో కుంకుమపూజ ఆ తర్వాత చండీహోమం జరుగుతుందని ఆలయ అర్చకుడు భైరవస్వామి తెలిపారు.

నేడు భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 6వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీ శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణం అనంతరం జంగారెడ్డిగూడెం చేరుకోవడానికి కూడా బస్సులను నడుపుతామని తెలిపారు. భద్రాచలం వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దువ్వలో దాహం కేకలు

తణుకు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం ముదరక ముందే తణుకు రూరల్ మండలం దువ్వలో దాహం కేకలు విని పిస్తున్నాయి.గ్రామంలో రెండు రక్షిత మంచినీటి పథకాలు వున్నప్పటికీ గతంలో మాదిరిగా ఇప్పుడు తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన జల్ జీవన్ పథకంలో పనులు పూర్తి కాకపోవడం కారణంగా ఇప్పుడు తాగునీరు అందడం లేదని చెబుతున్నారు. దువ్వలో జల్ జీవన్ పథకంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ అందించే కార్యక్రమం చేపట్టారు. దీంతో గ్రామంలోని పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేసినప్పటికీ వాటిని ఇంకా మంచినీరు రావడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లకు ట్యాప్‌లకు, జంక్షన్ వాల్వులు ఏర్పాటు చేయకపోవడంతో నీటి సరఫరా నిలిపివేసినట్లు పేర్కొంటున్నారు. గ్రామంలోని కొన్ని కుళాయిల నుంచి సన్నని దారగా వచ్చే నీటి కోసం పదుల సంఖ్యలో బిందెలు, బక్కెట్‌లు బారులు తీరి వుంటున్నాయి. దీంతో పాటు గ్రామంలో శశి స్కూల్ రోడ్డు, గీతామందిరం ఏరియాలలో కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అవసరాలకు సరిపడా నీరు అందడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

• మూడు రోజులకోసారి నీరు



దువ్వ గ్రామంలోని శశి రోడ్డు, గీతా మందిరం ఏరియా వాసులకు ట్యాంకర్ ద్వారా మూడు రోజులకోసారి మంచినీరు అందుతుంది. కుళా యిల నుంచి నీరు రావడం లేదని సచివాల యంలో చెప్పినా ఎవరూ పట్టించు కోవడం లేదు. వారం రోజుల్లో బాగు చేస్తామని చెప్పి 15 రోజులైనా ఇప్పటికీ కుళాయిల నుంచి నీరు రావడం లేదు. ట్యాంకర్ నుంచి మూడు రోజు లకోసారి వస్తుంది. మంచి నీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- మంగతాయారు, దువ్వ



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

• జంక్షన్ వాల్వులు ఏర్పాటు చేయాలి

దువ్వ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు.. పైప్ లైన్లు, కుళాయిల మధ్య అక్కడక్కడ వాల్వులు ఏర్పాటు చేయాలి. కాంట్రాక్టర్ త్వరలోనే ఏర్పాటు చేస్తానని చెప్పారు. వెంటనే వాల్వులు బిగిస్తాం.

-అడ్డా వెంకట సూర్యనారాయణమూర్తి (అడ్డా బాబు), గ్రామ సర్పంచ్, దువ్వ



అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఎన్‌ఆర్‌ఐ అనంతకోటిరాజు

జన్మభూమి అభివృద్ధికి రూ.35.15 కోట్లు

వేగేశ్న ఫౌండేషన్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ అనంత కోటిరాజు దాతృత్వం

శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రులు శ్రీనివాసవర్మ, నిమ్మల

గణపవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జన్మభూమి అభివృద్ధికి రాజువేగేశ్న ఫౌండేషన్ (ఇండియా) ద్వారా ఎన్‌ఆర్‌ఐ వేగేశ్న అనంత కోటిరాజు కోట్లాది రూపాయలు వెచ్చించడం స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. అనంతకోటిరాజు స్వగ్రామం గణపవరంలో సుమారు 8 ఎకరాల్లో రూ.20 కోట్లతో చెరువుల అభివృద్ధి, రూ.15కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణం, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, పాఠశాలల అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణం, పేదలకు ఇళ్ల స్థలాలకు మొత్తం రూ.35.15 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను శుక్రవారం మంత్రులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సభలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ సంపాదనలో కొంత భాగం స్వగ్రామం అభివృద్ధికి ఖర్చు చేస్తున్న వేగేశ్న ఫౌండేషన్ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌ఆర్‌ఐల సేవలు ఎంతో అవసరమన్నారు. ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ వేగేశ్న ఫౌండేషన్ ఇండియా చైర్మన్ అనంత కోటిరాజు చేపడుతున్న ఆధ్యాత్మిక, విద్య, తాగునీరు వంటి సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ అనంతకోటిరాజు సేవలు మరువలేనివని, గణపవరంలో వంద పడకల ఆసుపత్రి, బీసీ హాస్టల్ నిర్మాణ స్థలాలు కూడా సమకూర్చాలని కోరారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ అనంతకోటిరాజు దంపతులను కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్థానికులు గజమాలలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీపీ దండు రాము, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు పొత్తూరి వాసురాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, గ్రామాభివృద్ధి కన్వీనర్ కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, సర్పంచ్ మూరా అలంకారం, తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తీరంలో రూ.13.50 కోట్లతో రక్షణ గోడ

- పీఎం లంక వద్ద ఎనిమిది మీటర్ల వెడల్పుతో నిర్మాణం
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

నరసాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సముద్ర కోత నివారణకు పీఎంలంక వద్ద రూ.13.50 కోట్లతో రక్షణ గోడ నిర్మాణం చేపడతామని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ విప్ నాయకర్‌తో కలిసి గ్రామంలో డిజిటల్ భవనంలో అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. డిలైట్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో ఒక కిలో మీటరు మేర ఎనిమిది మీటర్ల వెడల్పుతో గోడ నిర్మాణం జరుగుతుందన్నారు. ఆ తరువాత మరో కిలోమీటర్ నిర్మిస్తామన్నారు. ఏడాదిలో ఈ పనులు పూర్తవుతాయన్నారు. నిపుణుల సూచనల అనుగుణంగా చేపట్టే ఈ పనుల వల్ల సముద్ర కోత తగ్గుతుందని, ప్రజలు సహకరించాలన్నారు. గ్రామంలో సుమారు వంద నివాసాల పైకప్పులపై త్వరలో సోలార్ రూఫ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం వేములదీవిలో చేపట్టిన ఉపాధి పనులు, లక్ష్మణేశ్వరంలోని నక్కావారిపాలెంలో గృహాలను కలెక్టర్ పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రభుత్వ భూమి కబ్జాపై కదిలిన అధికారులు

దొడ్డనపూడిలో భూమిని పరిశీలించిన భీమవరం ఆర్డీవో



దొడ్డనపూడిలో రికార్డులను పరిశీలిస్తున్న భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

కాళ్ళ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. కాళ్ళ మండలం దొడ్డనపూడిలో ఆర్ఎస్ నెం. 205/1ఏ, 1బిలో ఉన్న ప్రభుత్వ భూమిని సమీప రైతు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారంటూ 'ప్రభుత్వ భూమి కబ్జా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల స్థాయి అధికారులతో కలిసి ఆక్రమణకు గురైన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూమి రికార్డులను ఆయన పరిశీలించారు. భూమి తమదే అంటున్న సమీప రైతుకు నోటీసులు జారీ చేసి, సర్వే నెంబర్ల భూమి పూర్తిస్థాయి రికార్డులను తీసుకుని సోమవారం తన కార్యాలయంలో హాజరుకావాలని తహసీల్దార్ జి.సుందర్ సింగ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట మండల సర్వేయర్ ప్రవీణ్, వీఆర్వో చిట్టిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలు ప్రయాణిస్తున్న ట్రక్ ఆటో బోల్తా

- పది మందికి గాయాలు

చింతలపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెలగలపల్లి నుంచి వస్తున్న ఆటో చింతలపూడి శివారు ఆంథోని నగర్ వద్ద శుక్రవారం ఉదయం ట్రక్ బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న పది మంది మహిళా కూలీలకు గాయాలయ్యాయి. వారిని చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించగా కె.లక్ష్మి అనే మహిళను మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. తెలంగాణ సరిహద్దు దిద్దుపూడి గ్రామానికి చెందిన మహిళా కూలీలు వెలగలపల్లిలోని మొక్కజొన్న ఫ్యాక్టరీలో నైట్ షిఫ్ట్‌లో పనిచేయడానికి వెళ్ళి శుక్రవారం ఉదయం తిరిగి వస్తున్న సమయంలో ట్రక్ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారికి చికిత్స అందించారు. మిగిలిన తొమ్మిది మంది క్షేమంగా ఉన్నట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ

పెదపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కలపర్రు గౌరీశంకర్ డాబా వద్ద రోడ్డు పక్కన ఆగి వున్న లారీని మరో లారీ ఢీకొంది. లారీ డ్రైవర్ ఈనెల 1న తెల్లవారుజాము రెండు గంటల ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో ఆగి వున్న లారీ డ్రైవర్ వెంకటేశ్వరరావుకు గాయాలయ్యాయి. అతడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై కట్టా శారద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ షాపులో చోరీ

సత్య సెల్‌ఫోన్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి ఒక సెల్‌ఫోన్, రూ.1500 నగదు ఎత్తుకెళ్లారు. వసంతవాడ గ్రామానికి చెందిన షాపు యజమాని గుడిమెట్ల శివకుమార్ పెదపాడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

పల్లెలకు ఉపాధి శోభ

ఉపాధి హామీ నిధులతో ఏలూరు జిల్లాలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం



జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో నిర్మించిన సీసీ రహదారి

ఏలూరు సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులు అభివృద్ధికి ఆసరాగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. జిల్లాలో సమర్థవంతంగా ఉపాధి హామీ పథకం పనులు చేపడుతున్నారు. కూలీలకు ఉపాధి కల్పనతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి పథకం ఎంతో ఉపయోగ పడుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం 38 లక్షల మొక్కల పెంచడానికి చర్యలు తీసుకున్నారు. పాడి రైతులు, ఉద్యాన రైతులకు మరింతగా ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తూ పశువులకు నీటి తొట్టెలు, షెడ్లు ఏర్పాటుకు నిధులు కేటాయించారు. పామాయిల్, కోకో, మామిడి తదితర పంటలకు చేయూత ద్వారా 10 వేల ఎకరాలకు పైగా లక్ష్యంతో ఉపాధి హామీ ఉద్యాన రైతులకు తోడ్పాటునిస్తోంది. వాననీటిని పంటలకు దగ్గరలోనే ఒడిసిపట్టే విధంగా, భూగర్భ జలాల నిల్వలు పెంచడం కోసం ఫారం పాండ్స్, రింగ్‌ట్రెంచ్ పనులు చేయడానికి ఉపాధి నిధులను కేటాయించడమే కాకుండా ఆ పనులు త్వరితగతిన పూర్తి కావడానికి ప్రణాళికలు రూపొందించింది.



పశువులకు షెడ్లు ఏర్పాటు

జిల్లాలో పశువుల కోసం పశువుల షెడ్ల ఏర్పాటుకు ఉపాధి హామీ నిధులను కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో 639 పశువుల షెడ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 411 పశువుల తొట్టెలు నిర్మించడానికి కలెక్టర్ అనుమతి పొందారు.

ఐదు వేల ఫాం పాండ్స్ ఏర్పాటు

భూగర్భ జలాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఈ ఏడాది 5 వేల ఫాం పాండ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే 3,200 ఫాంపాండ్స్ ఏర్పాటుకు అనుమతి పొందగా 561 పాండ్స్ నిర్మాణం పూర్తయింది.



ఉద్యమంలా సీసీ రోడ్ల నిర్మాణం

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలతో పాటు అన్ని మండలాల్లో 2024-25లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారుల నిర్మాణం ఉద్యమంలా కొనసాగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రహదారుల నిర్మాణాలతో పల్లెల్లో వీధులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రూ.180.58 కోట్లతో 1,578 పనులను చేయాలని నిర్ణయించారు. 376.25 కిలోమీటర్ల మేర సీసీ రహదారులను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. ఇప్పటికే జిల్లాలో 228.11 కిలోమీటర్ల మేర 1168 పనులను పూర్తి చేశారు.

లక్ష్యానికి మించి పనిదినాలు

ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించడానికి డ్వామా శాఖ ఒక ప్రణాళికను రూపొందించుకోవడమే కాకుండా లక్ష్యానికి మించి ఇప్పటికే ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించి రాష్ట్రంలోనే కూలీలకు పని కల్పించడంలో అగ్రగామిగా నిలిచింది. జిల్లాలో కోటి 20 లక్షలు పని దినాలు లక్ష్యంకాగా ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు కోటి 23 లక్షలు పనిదినాలు కల్పించి 103 శాతం ప్రగతి సాధించింది. 4.23 లక్షల మంది కూలీలకు వేతనాల రూపంలో రూ.312.57 కోట్లు చెల్లింపులు చేసింది. 2025-26లో కోటి 30లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్ణయించుకుని రాబోయే మూడు నెలల్లో 90 లక్షల పనిదినాలను కల్పించాలని నిర్ణయించారు.

పనులు వేగవంతం



జిల్లాలో ఉపాధి హామీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానంచేసి ఉద్యాన రైతులకు చేయూతనిస్తున్నాం. కూలీలకు ఉపాధి కల్పనలో నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి జిల్లా అగ్రగామిగా నిలిచింది.

కె.వెంకటసుబ్బారావు, డ్వామా పీడీ

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా ఉద్యాన మొక్కల పెంపకాన్ని చేపట్టింది. జిల్లాలో 3,150 ఎకరాల్లో ఉద్యాన మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. దీంతో పాటు కమ్యూనల్ ప్లాంటేషన్‌లో భాగంగా 37.80 లక్షల మొక్కలను పెంచటానికి కలెక్టర్ ఆమోదంతో అటవీశాఖకు అందజేశారు.

ప్రగతివైపు పల్లె దారులు

ఏలూరు రూరల్: వైసీపీ పాలనలో గుంతలమయమైన గ్రామీణ రోడ్లకు ప్రస్తుతం మహర్దశ పట్టింది. ఏలూరు రూరల్ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే గ్రామాల్లో ఉన్న గుంతల రోడ్లను ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తయ్యాయి. మాదేపల్లిలో ఉపాధి హామీ పథకం నిధులతో రూ.17.50 లక్షలతో మాదేపల్లి జడ్పీ స్కూలు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తి చేశారు. కాట్లంపూడిలో సీసీ రోడ్డు పూర్తవడంతో గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మృత్యువును గెలవలేక..

13 రోజులుగా చికిత్స పొందుతున్న ఫార్మాసిస్ట్ నాగాంజలి మృతి

- రాజమహేంద్రవరం ఆస్పత్రి నుంచి భౌతిక కాయం స్వగ్రామానికి తరలింపు
- రౌతుగూడెంలో విషాదం..
- నిందితుడిని కఠినంగా శిక్షించాలన్న గ్రామస్థులు



ఒక్కగానొక్క కూతురు.. 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పుట్టిన బిడ్డ. పేద కుటుంబమైనా అపురూపంగా చూసుకుని.. ఉన్నత చదువు కోసం పట్టణం పంపించారు. అక్కడ మోసగాడి చేతికి చిక్కి విలవిల్లాడింది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. 13 రోజులుగా మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. తల్లిదండ్రులకు కుమార్తె మృతి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, (ఇన్‌సెట్) నాగాంజలి (ఫైల్)


జీలుగుమిల్లి / రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఉద్యోగి లైంగిక వేధింపులతో ఆత్మహత్యాయత్యానికి పాల్పడిన ఫార్మాసిస్ట్ నల్లపు నాగాంజలి శుక్రవారం మృతిచెందింది. 13 రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచింది. ఆమె మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో ప్రైవేట్ అంబులెన్సులో నాగాంజలి మృతదేహాన్ని స్వగ్రామమైన జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం తరలించారు. నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అత్యంత సున్నితమైన అంశం కావడంతో ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చారు. నాగాంజలి తండ్రి దుర్గారావును పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా, మహిళా సంఘం నాయకులు ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకున్నారు.

తీరని విషాదం

రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్‌లో ఉన్న నాగాంజలి కొద్ది రోజుల్లో చదువు పూర్తి చేసుకుని తిరిగి వస్తుందనుకుంటే విగతజీవిగా రావడం రౌతుగూడెంలో తీవ్ర విషాదం నింపింది. వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడి ఫైనలియర్ చదువుతోంది. ఇంటర్న్‌షిప్ లో భాగంగా కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో 9 నెలలుగా ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తుంది. బొల్లినేని ఆస్పత్రిలో మెడికల్ కోఆర్డినేటర్ దువ్వాడ మాధవరావు దీపక్ ఆమెను పెళ్లి చేసు కుంటానని నమ్మించి మోసం చేశాడు. మనస్తాపం చెందిన నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహం గ్రామంలోకి చేరగానే గ్రామస్థులు ఆందోళనకు దిగారు. నాగాంజలి కుటుంబానికి న్యాయం చెయ్యాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

నేతల పరామర్శ

నాగాంజలి తల్లిదండ్రులు నల్లపు దుర్గారావు, అనంతలక్ష్మిని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శ్యామలారాణి, మండల మహిళా సంఘాల నాయకులు ఎస్.నిర్మల, కె.దుర్గ, సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు సమీప గ్రామాల వారు పలువురు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వికాస్ కళాశాల ప్రిన్సిపాల్, రాచన్నగూడెం, ములగలంపల్లి, అశ్వారావుపేట, ఆసుపాక గ్రామాల వారు నాగాంజలి మృతదేహానికి నివాళులర్పించారు. రౌతుగూడెంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ బి.వెంకటేశ్వరావు, సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్సైలు నవీన్‌కుమార్, విజయ్‌బాబు, మహేశ్వరావు శాంతిభద్రతలు పర్యవేక్షించారు.



పుట్టెడు దుఃఖంలో తండ్రి

ఆసుపత్రి వద్ద నాగాంజలి తండ్రి దుర్గారావు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. ఆయన పరిస్థితి చూసి అక్కడున్న వారు కన్నీటి పర్యంతమయ్యారు. కుమార్తెకు జరిగిన అన్యాయం, దిగులు ఎవరితో పంచుకోలేక, బాధ, ఆవేదన తనలోనే దిగమింగుకుని నిస్సహాయంగా ఆసుపత్రి ఆవరణలోని చెట్టుకింద దిగాలుగా కూర్చోవడం అందరినీ కలచివేసింది. కూతురి మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతుంటే దుర్గారావు మౌనంగా రోదిస్తూ ఒంటరిగా ఉండిపోయారు.

వాడిని కఠినంగా శిక్షించాలి..

మా పాపకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదు. వాడిని కఠినంగా శిక్షించాలి. ఇది మా కోరిక. ప్రభుత్వం తరపున సహకారం అందుతుంది. మా పాప పరిస్థితి ఎవరికీ రాకూడదంటే వాడిని కఠినంగా శిక్షించాల్సిందేనని దుర్గారావు అన్నారు.

అప్పుల భారంతో మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఒక మహిళ ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరులోని గొల్లాయిగూడానికి చెందిన వరసా మనీషా (46)కు భర్త మధుసూదనరావు, కుమారుడు చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. అప్పులు ఎక్కువ అయిపోవడంతో ఇల్లు కూడా అమ్మేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మనీషా గురువారం రాత్రి ఎలుకల మందు తినేసింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కడుపునొప్పి తాళలేక..

కామవరపుకోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పిని భరించలేక మహిళ చీరను మెడకు చుట్టుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కామవరపుకోట మండలం ఉప్పలపాడులో చోటు చేసుకుంది. తడికలపూడి పోలీసుల కథనం ప్రకారం ఉప్పలపాడు గ్రామానికి చెందిన డోరేపల్లి సూర్యనారాయణ కుమార్తె గంగాభవానిని 15 ఏళ్ల క్రితం టి.నర్సాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన మేనమామ కాళ్నీడి ధనలక్ష్మీనారాయణతో వివాహం చేశారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గంగాభవాని కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఉప్పలపాడులో ఉన్న తన అన్నను చూడడానికి పిల్లలతో ఈనెల 2న వచ్చింది. అదేరోజు రాత్రి ఆమెకు కడుపునొప్పి వచ్చింది. 3న ఆమె తండ్రి పొలం, తల్లి వేరే ఊరు వెళ్లగా గంగాభవాని తన పిల్లలతో కలిసి ఇంటి వద్దనే ఉంది. ఆమెకు మళ్లీ విపరీతమైన కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లో మెడకు చీర చుట్టుకుని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గంగాభవాని మృతదేహానికి రెవెన్యూ అధికారులు శుక్రవారం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలో పడిన రైతు మృతదేహం లభ్యం



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం వద్ద ఎర్రకాలువలో పడి గల్లంతైన రైతు చల్లా బసవయ్య (70) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. లక్కవరం ఎస్సై శశాంక వివరాలు తెలిపారు. గురువారం సాయంత్రం పశువులను మేపడానికి వెళ్లిన బసవయ్య తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఎర్రకాలువ వద్ద అతడి వస్తువులు ఉండడంతో అనుమానంతో రాత్రంతా కాలువలో గజ ఈతగాళ్లతో గాలించినా ఆచూకీ లేదు. శుక్రవారం ఉదయం బసవయ్య మృతదేహం కాలువలో పైకి తేలి ఉండడంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి



వెంకటేశ్వరరావు మృతదేహం

పాలకోడేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సీహెచ్.వెంకటేశ్వరరావు (37) ఆకస్మికంగా మృతి చెందారు. ఆకివీడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణంగా స్వగ్రామమైన శృంగవృక్షంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో బాత్ రూమ్‌కు వెళ్లి ఎంతసేపటికి రాకపోవడంతో ఆయన భార్య వెళ్లి చూడగా స్పృహ తప్పి ఉన్నారు. దగ్గరలో ఉన్న ఆర్ ఎంపీ వైద్యుడిని పిలిపించి చూపించగా ఆయన మృతి చెందినట్లు తెలిపారు. తదనంతరం మృతుడి భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు శుక్రవారం పాలకోడేరు ఎస్ఐ మంతెన రవివర్మ అనుమానాస్పద మృతిగా నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నూజివీడులో వివిధ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో వివిధ షాపుల్లో నాణ్యమైన వస్తువులు ఉండడం లేదని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి శ్రీరాంబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం నూజివీడు పట్టణంలో విజిలెన్సు, తూనికలు, కొలతల అధికారులు సంయుక్తంగా ఆయిల్స్, ఫ్లోర్ మిల్స్, చికెన్, చేపల షాపులు, కిరణా షాపులపై దాడులు నిర్వహించారు. శ్రీనివాసా ఫ్లోర్ అండ్ ఆయిల్ మిల్లు, పచారీ షాపు, తిరుమల లైవ్‌ఫిష్ షాపు, తిరుమల చికెన్ షాపు, శ్రీ శ్రీనివాసా ఫ్లోర్ మిల్లు (మర్రిబందం)లో తనిఖీలు చేశారు. ప్యాకింగ్ లైసెన్సు, సర్టిఫికెట్లు లేనివాటిని గుర్తించారు. కొన్ని దుకాణాలపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ కె.నాగరాజు, నూజివీడు తూనికలు కొలతల అధికారి వాసుదేవరావు వారి సిబ్బంది పాల్గొన్నారు.

కోకోనట్ మర్చంట్స్ నూతన కార్యవర్గం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం స్థానిక సంఘ భవనంలో జరిగింది. అధ్యక్షుడిగా కటారి నాగేంద్ర కుమార్, కార్యదర్శిగా మాటూరి సోమేశ్వర వెంకట రామ్ కుమార్, ఉపాధ్యక్షులుగా చివటపు నాగేశ్వరరావు, కుందురు వెంకట్రామయ్య, లంకలపల్లి నాగ వెంకట సత్యరమేష్, సహాయ కార్యదర్శిగా కొండేటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

230 మందికి కంటి వైద్య పరీక్షలు

అత్తిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మంచిలిలో అత్తిలి, రేలంగి లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. 230 మంది రోగులను పరీక్షించారు. 30 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. 15 మందిని రిఫరల్ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. 92 మందికి ఉచితంగా కళ్ళజోళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. సిరగాని నాగేశ్వరరావు, జిల్లా చైర్‌పర్సన్ మల్లికార్జునరావు ఆర్థిక సాయంతో శిబిరాన్ని నిర్వహించారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

భీమవరం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా సామంతపూడి శ్రీరామ రాజు(పాలకొల్లు) తిరిగి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చవ్వాకుల నరసింహారావు(భీమవరం), కొత్తపల్లి సూర్యనారాయణ(అత్తిలి), కార్యదర్శిగా కొత్త వెంకట శ్రీరామనారాయణ(భీమవరం), సహాయ కార్యదర్శులుగా పేరూరి వీఎస్ఎన్ రాధాకృష్ణ(ఆకివీడు), అనంతపల్లి ఫణీంద్రరామ వెంకట సుబ్బారావు (మొగల్తూరు), కోశాధికారిగా పెరుమాళ్ళ వెంకట హరినాథ్ (గణపవరం) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుంది.

ఫెర్టిలైజర్స్ డీలర్స్ నూతన కార్యవర్గం

ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక గాదిరాజు విశ్వనాథరాజు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా బొండా వెంకట సత్య శ్రీరామహనుమంతరావు, ఉపాధ్యక్షుడిగా చవ్వా శ్రీనివాససుబ్బారావు, కార్యదర్శిగా కూర్మదాసు సత్యశ్రీనివాస్(వాసు), సహాయ కార్యదర్శిగా మీసాల భాస్కరరావు, కోశాధికారిగా సోము శేషారావు ఎన్నికయ్యారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యనిర్వాహక వర్గ సభ్యుడిగా కూర్మదాసు సత్య శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నరసాపురం ఏఎంసీ చైర్మన్‌గా వలవల నాని?



నరసాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):నరసాపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా జనసేన సీనియర్ నాయకుడు వలవల నానిని నియమిస్తున్నట్టు తెలిసింది. ఈ పదవి కోసం కూటమిలో టీడీపీ నుంచి రెండు మూడు పేర్లు షికారు చేశాయి. అయితే జనసేనే ఈ పదవిని తీసుకుంటున్నట్టు సమాచారం. జనసేన ఆవిర్భావం నుంచి నాని పార్టీలో కొనసాగుతూ వస్తున్నాడు. ఇటు విప్ నాయకర్‌కు అత్యంత సన్నిహితుడు, సలహాదారు కావడంతో ఆయనకే ఈ పదవిని కట్టబెడుతున్నట్లు ప్రచారం జరుగుతోందవి. త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది.

నరసాపురం తహసీల్దార్‌గా సత్యనారాయణ

నరసాపురం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):నరసాపురం తహసీల్దార్‌గా అయితం సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన రాజరాజేశ్వరి సెలవుపై వెళ్లడంతో సివిల్ సప్లై డీటీగా పనిచేస్తున్న సత్యనారాయణకు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను డీటీ ప్రసాద్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, జయరాం, చిరంజీవి, సత్తిబాబు, మెహర్‌బాబా, వీరస్వామి, సిబ్బంది బొకేలందించి అభినందించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్

తణుకు రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తణుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆర్. లోహిత్ జయ సాగర్ వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇరగవరం ఎంపీడీవో ఎ. శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమితులైనట్లు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెసు పార్టీ జిల్లా నూతన కార్యవర్గం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెసు పార్టీ గ్రామ స్థాయి నుంచి బూత్ లెవల్ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అధ్యక్షులు హరి కుమార్ తెలిపారు. భీమవరం కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించి నియామక పత్రాలను జిల్లా అధ్యక్షుడు హరి కుమార్ రాజు అందించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా అద్దంకి దొరబాబు, ఎడ్ల శివాజీ, గాదిరెడ్డి వనమయ్య, పి. వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. జిల్లా జనరల్ సెక్రటరీలుగా పుచ్చకాయల రత్నంరాజు, సనకు ప్రసాద్, ధర్మేంద్ర, కృష్ణ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించగా మేడపాటి సాగర్, కొర్ర శ్రీనివాస్ యాదవ్ తో పాటు మరో 15మందిని జిల్లా జాయింట్ సెక్రటరీలుగా నియమించనున్నట్లు హరికుమార్ రాజు నియమితులయ్యారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎంకు ఆహ్వానం



భీమవరం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 28 వరకు భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం చంద్రబాబు నాయుడును మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు కోరారు. అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎంను కలసి ఉత్సవ వివరాలను తెలియచేసారు. సీఎం చంద్రబాబు ఆలయానికి వస్తారని ఆశిస్తున్నామన్నారు. మందిర డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


రసరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి, గజల్స్ శ్రీనివాస్ తదితరులు

రసరాజుకు కళారత్న తణుకుకే గర్వకారణం: ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 4(ఆంధ్ర జ్యోతి): తణుకు పట్టణానికి చెందిన కవి, సినీ గేయ రచయిత రసరాజుకు కళారత్న అవార్డు రావడం తణుకు ప్రాంతానికి గర్వకారణమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం రసరాజుకు అభినందన సభ నిర్వహించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కళలకు పెద్దపీట వేస్తోందన్నారు. మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాసు మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం కళాకారులకు ఒక్క పురస్కారం కూడా అందించలేదన్నారు. సీఎం చంద్రబాబుకు కళలపైన, సాహిత్యం పైన ఉన్న గౌరవంతోనే కళాకారులకు ఉగాది పురస్కారాలు అందజేశారని చెప్పారు. అనంతరం రసరాజును గజల్ శ్రీనివాసు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే రోటరీ క్లబ్ తరఫున ఎమ్మెల్యేను, గజల్స్ శ్రీనివాసును సత్కరించారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

మానవత ప్లేట్లు, గ్లాసుల వితరణ

తణుకు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తణుకు మానవత ఆధ్వర్యంలో ఎస్ఎన్‌వీటీ కళాశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దాతలు చిట్టూరి సుజాత, కఠారి శారదాదేవి తదితరులు ఆర్థిక సాయంతో 200 స్టీలు గ్లాసులు, 50 భోజనం ప్లేట్లు అందజేసారు. ప్రిన్సిపాల్ వి.తులసీ లక్ష్మి, మానవత నాయకులు డా. కోడూరి రాధా పుష్పవతి, గమిని రాంబాబు, బోయపాటి రామలక్ష్మి, బి. కాశీ, అక్కిన కాశీ విశ్వనాధం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో యూట్యూబ్ చానల్‌పై పోలీసులు, స్థానిక నేతలు అక్రమంగా కేసులు బనాయించడంపై ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండించారు. అనంతరం తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి రంగసురేష్, కార్యదర్శి జి.బుజ్జిబాబు, ఎలక్ట్రానిక్ జిల్లా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాసరావు, ఏపీయుడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి గజపతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నరసాపురం పంజా సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ముస్లింలు



తాడేపల్లిగూడెంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

వక్ఫ్ సవరణపై నిరసనలు

భీమరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. శుక్రవారం ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ముస్లిం కమిటీ అధ్యక్షులు షేక్ రబ్బాని, ఎంఏ నౌషద్, ఎండీ ఫర్హాన్, అఫ్జల్ పాషా, ఎండీ కరీముల్లా, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

తణుకు రూరల్: వక్ఫ్ సవరణను విరమించుకోవాలని సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వేల్పూరు మసీదులో వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు అంబటి రామకృష్ణ మాట్లాడుతూ లౌకిక విలువలను, మైనారిటీల హక్కులను హరించేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ముస్లింల న్యాయ పోరాటాలకు సీపీఎం అండగా నిలుస్తుందన్నారు. నాయకులు కే వీరభద్రరావు, పెద్దలు షేక్ సత్తార్ బాషా, లాల్ సాహెబ్, మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: వక్ఫ్‌బోర్డ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తాడేపల్లిగూడెం సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ వెంటనే ఈ బిల్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తణుకు: నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పీవీ ప్రతాప్, కామన మునిస్వామి, ముస్లింలు పాల్గొన్నారు.

పెనుగొండ: వక్ఫ్ సవరణ బీజేపీ హిందుత్వ అజెండాలో భాగమేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్. వెంకటేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం పెనుగొండ జామియా మసీదు వద్ద నిరసన తెలిపారు. పెనుగొండ జామియా మసీదు అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరా, సిద్ధాంతం మసీదు అధ్యక్షుడు షేక్ అమిన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: వక్ఫ్ ఆస్తులకు చిల్లు పెట్టేందుకే వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అని కాంగ్రెస్ పట్టణ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ రసూల్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

నరసాపురం టౌన్: వక్ఫ్ సవరణను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలు ఆందోళన చేపట్టారు. లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకే బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సీపీఎం నాయకులు కవురు పెద్దిరాజు, త్రిమూర్తులు, నారాయణరావు, కొండ, అజీజ్, షాజహాన్, అహ్మద్‌షా, షరీఫ్, మోహిద్, ఫిరోజ్‌ఖాన్, రషి, అబ్దుల్లా పాల్గొన్నారు.

ముస్లింల పట్ల జగన్ ద్వంద్వ వైఖరి : మంత్రి నిమ్మల

పాలకొల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ముస్లింల పట్ల జగన్ ద్వంద్వ వైఖరి యావత్ దేశానికి తెలిసిందని, ఆయన తీరుకు ముస్లిం వర్గాలు మండిపడుతున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పూలపల్లిలో జిన్నూరు పంట కాలువ, రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేసి మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు విషయంలో కూటమికి బలం ఉన్న లోక్ సభలో వ్యతిరేకించి, కేంద్రానికి కీలకమైన రాజ్యసభలో అనుకూలంగా వైసీపీ ఓటు వేసిందని మంత్రి నిమ్మల తెలిపారు. జగన్ సూచనల మేరకే రాజ్యసభలో బిల్లుకు మద్దతుగా వైసీపీ ఎంపీలు ఓటు వేశారన్నారు. ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు ఓటింగ్ తర్వాత విప్ జారీతో వైసీపీ డ్రామా ఆడిందన్నారు. రాజ్యసభలో మద్దతుపై జగన్ నిజ స్వరూపం మైనార్టీ వర్గానికి అర్థమయ్యిందని మంత్రి పేర్కొన్నారు. జగన్ ఇప్పటికైనా ఓపెన్‌గా మాట్లాడటం నేర్చుకోవాలని మంత్రి నిమ్మల హితవు పలికారు.


సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

పెంటపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలో పలు సీసీ, బీటీ రహదారులను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి ప్రారంభించి మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ దాసరి హైమవతి, పుల్లా బాబి, పాతూరి రాంప్రసాద్ చౌదరి, సర్పంచ్ పీతల సత్యనారాయణ, గంధం సతీష్, పంతం శేఖర్, నరాలశెట్టి సంతోష్‌కుమార్, బీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బట్టలు పంపిణీ చేస్తున్న నాయకర్, కలెక్టర్, జేసీ

చెత్త నిర్మూలనకు సహకరించాలి

నరసాపురం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శుక్రవారం ప్రభుత్వ విప్ నాయకర్‌తో కలిసి గ్రామంలోని డిజిటల్ భవనంలో అభివృద్ధి పనులపై కలెక్టర్ నాగరాణి సమీక్ష నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో విప్ నాయకర్ మాట్లాడుతూ చెత్త నిర్మూలనలో ప్రజలు సహకరించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా స్వీకరించాలన్నారు. నరసాపురాన్ని చెత్త రహిత పురపాలకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, కమిషనర్ అంజయ్య, చైర్‌పర్సన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దండగర్ర విద్యార్థినుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం) జిల్లా స్థాయి ఎక్స్‌పోలో దండగర్ర జడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచారు. భీమవరం ఏఆర్‌కే మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఎక్స్‌పోలో వీరు తృతీయ స్థానంలో నిలిచారు. విద్యార్థినులను, గైడ్ టీచర్ కె నాగేశ్వర రావును ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.


వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేస్తున్న ధర్మరాజు

48 గంటల్లోనే ధాన్యం సొమ్ము

గణపవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు రైతులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పిప్పర రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేశారు. సరిపల్లె, గణపవరంలలో సీసీ రహదారులను ప్రారంభించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లోనే సొమ్మును జమ చేస్తారని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏడీఏ మురళీకృష్ణ, ఏఓ వైవీఎస్ ప్రసాద్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు పొత్తూరి వాసురాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్నారు : మేట్ మాధురి

మొగల్తూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తనను వెళ్లిపోవాలంటూ వేధిస్తున్నారని మేట్ గుబ్బల మాధురి ఆరోపించారు. పేరుపాలెం సౌత్ గ్రామంలో భీష్మ గ్రూప్‌లో 30 మంది ఉపాధి పనులు చేస్తూ జీవిస్తున్నామని తమ గ్రూప్‌కు మాధురి మేట్‌గా వ్యవహరిస్తున్నారని, గ్రామంలో రాజకీయ కక్షతో మేట్‌ను తొలగిపోవాలంటూ వనమాలి శ్రీను, ఓసూరి రాంబాబు ఇబ్బంది పెడుతున్నారని ఉపాధి గ్రూప్ సభ్యులు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

సెంట్రల్ వర్సిటీ భూములు పరిరక్షించాలి

తణుకు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హైద్రాబాదులోని సెంట్రల్ యూనివర్శిటీ భూములను పరిరక్షించాలని, యూనివర్శిటీ విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి అన్నారు. శుక్రవారం జాతీయ కమిటీ పిలుపు మేరకు వెంకటేశ్వర సెంటర్‌లో ధర్నా నిర్వహించారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల

రైతులకు అండగా ప్రభుత్వం

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, తమ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర జల వనరులు శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జిన్నూరు ఛానల్‌పై రూ.1.06 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 3 గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిన్నూరు ఛానల్‌పై 15 వేల ఎకరాల ఆయకట్టు రైతులు నడకదారి లేక, ట్రాక్టర్లు వెళ్లే మార్గం లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో జిన్నూరు ఛానల్ కాల్వగట్టు, దీనికి ఆనుకుని ఉన్న మరో రెండు రోడ్లకు గ్రావెల్‌రోడ్లు నిర్మించనున్నా మన్నారు. భవిష్యత్తులో పుంతరోడ్లను గ్రావెల్ రోడ్లుగా మారుస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మెన్ గాంధీభగవాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లు, పంటకాల్వల ప్రక్షాళన

ఉండి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లు, పంట కాలువలను ప్రక్షాళన చేయనున్నట్లు ఉండి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు మంతెన సాయి లచ్చిరాజు అన్నారు. శుక్రవారం ఉండి నీటి సంఘం పరిధిలో రామాపురం వద్ద వున్న తెల్లకోడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోవడంతో పనికి ఆహార పథకంలో ఉండి మండలంలో పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్ పూడుకుపోవడం వల్ల సాగు నీరు నిలిచిపోతోందని, పనులను గుర్తించి పూర్తి చేయించాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు సూచించడంతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నీటి సంఘం డైరెక్టరు గొట్టుముక్కల భాస్కరరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంపును అరికట్టడంలో అధికారులు విఫలం

పాలకోడేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మోగల్లు ప్రభుత్వ కాలనీ తరచూ ముంపునకు గురవుతున్నా దానిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. శుక్రవారం మోగల్లులో ప్రభుత్వ కాలనీని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులతో ఇళ్లు కట్టుకుంటే ప్రతి 3 నెలలకోసారి ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. దీనికి కారణం కాలనీ చుట్టూ అనధికార ఆక్వా చెరువులు సాగే కారణమన్నారు. ఈ విషయమై ఎమ్మార్వోతో మాట్లాడితే తన పరిధి కాదు, ఎంపీడీవోతో మాట్లాడుకోండి అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పడం సరికాదన్నారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని గోపాలన్ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



కళాశాల విద్యే కీలకం: ఆర్జేడీ

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలను చక్కదిద్దేది కళాశాల విద్యేనని కళాశాల విద్యా జోన్ 1, 2 ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జేడీ) డాక్టర్ ఎస్. శోభారాణి అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) 58వ వార్షికోత్సవం శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాజ రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రగతి, వచ్చే విద్యాసంవత్సరం డిగ్రీ, పీజీ కోర్సుల అడ్మిషన్ల కరపత్రాలను ఆర్‌జేడీ ఆవిష్కరించారు. స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శోభారాణి, సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ రాఘవయ్య తదితరులు ప్రసంగించారు. ముందుగా కళాశాల స్థల దాత అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి విగ్రహానికి, భారత ఉప రాష్ట్రపతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

పేదలకు స్థలాలివ్వాలని ధర్నా

తణుకు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని, తక్షణమే పేదలకు స్థలాలిచ్చి ఆదుకోవాలని తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతి పత్రం ఇచ్చారు

న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం

తణుకు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ న్యాయవాదుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులుగా కాకొల్లు విజయ్, ప్రధాన కార్యదర్శిగా ముమ్మిడివరపు ప్రతాప్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా రాపాక ప్రభాకర్, కోశాధికారిగా ఏలూరి చిట్టి మోషే ఎన్నికయ్యారు. అందరి సహకారంతో న్యాయవాదుల సంక్షేమానికి పాటుపడతామని విజయ్ అన్నారు.

ఇంటర్వ్యూలకు 600 మంది హాజరు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న సుమారు 600 మందికిపైగా దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపీడీవో రామకృష్ణంరాజు, సూపరింటెండెంట్ వీరభద్రరావు, ఇవోపీఆర్డీ నాగేంద్రకుమార్, సురేష్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

పెంటపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో టీవీ.రామకృష్ణ, సర్పంచ్ కోలా శేషవేణి అన్నారు. శుక్రవారం దర్శిపర్రులో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ఇంటింటా ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మకు కడుపు కోత..!

(5వ పేజీ తరువాయి)

ఆపరేషన్‌ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో జిల్లా వైద్యాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆచంట పీహెచ్‌సీలో 97 శాతం సిజేరియన్‌లు జరగ్గా కేవలం మూడు శాతమే నార్మల్ డెలివరీలు జరిగినట్లు నివేదికలు ఉండటంతో ఆడిట్ బృందం తనిఖీ చేపట్టింది.

అత్యధిక సిజేరియన్లు ఆ ఆసుపత్రుల్లోనే..

జిల్లాలో 120 ప్రైవేట్ ఆసుపత్రుల్లో గైనకాలజిస్టుల ద్వారా ప్రసవాలు చేసేందుకు అనుమతి వుంది. ఇందులో అత్యధికంగా సిజేరియన్ ఆపరేషన్‌లు చేస్తున్న 42 ఆసుపత్రులను గుర్తించారు. 'సాధారణ డెలివరీలు చేయకుండా ఎందుకు సిజేరియన్లు చేశారు ? కారణాలు ఏమిటి ? మిగిలిన ఆసుపత్రులతో పోలిస్తే మీ వద్దే ఎందుకు ఇలాంటి పరిస్థితి నెలకొంది' వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీచేశారు. అలాగే ఇందులో టాప్ 5 ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఎక్కువగా ఆపరేషన్లు నిర్వహిస్తున్న ఆసుపత్రులను తనిఖీ చేసేందుకు ఆడిట్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్(డీఐవో), గైనకాలజిస్టు, మత్తు వైద్యులు ఉంటారు. వీరు ఆసుపత్రులకు వెళ్లి రికార్డులను పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు అందిస్తారు. జిల్లాలో సిజేరియన్లు తగ్గించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడు తున్నట్లు డీఎంహెచ్‌వో గీతాబాయి తెలిపారు. ఎక్కువ ఆపరేషన్‌లు చేసే ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆపరేషన్లు ఎప్పుడు చేయాలి ?

- ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) మార్గదర్శ కాల ప్రకారం.. ప్రసవాల్లో పది నుంచి 15 శాతం మాత్రమే సిజేరియన్లు ఉండాలని నిర్దేశించింది. కాని, ఆ మార్గదర్శకాలు ఇక్కడ అమలు కావడం లేదు.
- శిశువు అడ్డం తిరగడం, గుండె సంబంధిత తదితర అత్యవసర సమయాల్లో మాత్రమే శస్త్ర చికిత్సలు చేయాలి.

తల్లీబిడ్డల ఆరోగ్యాలపై ప్రభావం

- సిజేరియన్ ఆపరేషన్‌ల కారణంగా అటు తల్లితోపాటు ఇటు బిడ్డల ఆరోగ్యంపైన తీవ్ర ప్రభావం పడుతోంది.
- శిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రు పాలు ఇవ్వాలి. ఇది సాధారణ ప్రసవాల్లో సాధ్యమవుతోంది. సిజేరియన్ వల్ల తల్లి నిద్ర మత్తులో ఉంటుంది కాబట్టి బిడ్డకు పాలు ఇవ్వలేదు. కాబట్టి వారిలో వ్యాధి నిరోధక శక్త తగ్గి అనారోగ్యం పాలయ్యే అవకాశం వుంది.

ఆధ్యాత్మికం



బలుసులమ్మకు వలవల పూజలు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల ఇలవేల్పు బలుసులమ్మ వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆనందంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బలుసులమ్మ వారిని దర్శించుకుని పూజలు చేసారు. ఆలయ కమిటీ ఆయనను సత్కరించింది.



మాదివాడలో విగ్రహాల పునఃప్రతిష్ఠ

ఆకివీడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాదివాడ కోదండ రామాలయంలో శుక్రవారం సీతారాముల విగ్రహాలను మోటుపల్లి సుబ్బారావు, మోటుపల్లి రామవర ప్రసాద్, మోటుపల్లి గంగాధరరావు, మోటుపల్లి సత్యనారాయణ దంపతులు పునఃప్రతిష్ఠించారు. హోమాలు మహాపూర్ణాహుతి, శాంతి కళ్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన జరిగింది. పట్టణ పెద్దలను సన్మానించారు. శనివారం మహాకుంభాభిషేకం, ఆదివారం సీతారాముల కల్యాణానికి ప్రముఖులు హాజరు కానున్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ

భీమవరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సాయంతో దెయ్యాల తిప్పలో నిర్మించిన రామాలయం ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభ పూజలో అంగ మనోజ్ నరసింహ వర్మ దంపతులు, శిఖర ప్రతిష్ఠ పూజల్లో పొనమండ నారాయణ దంపతులు పాల్గొన్నారు. భారీగా భక్తులు కార్యక్రమాన్ని వీక్షించారు. అన్నసమారాధన జరిగింది.



కోదండరాముడికి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి పూజలు

కాళ్ళ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెద అమిరంలోని కోదండ రామాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివ రామరాజు, బీజేపీ ఉండి ఇన్‌ఛార్జి కోరా రామ్మూర్తి, సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ జవ్వాది లీలాకిషోర్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని రామాలయం కమిటీ సభ్యులు సత్కరించారు. అనంతరం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.